
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి 5 మెదక్ జిల్లాల వార్తలు
గురువారం 22 ఆగస్టు 2024



ఆర్టీసీకి రాఖీ పండుగ
ఆదాయం రూ.5.12 కోట్లు
● మెదక్ రీజియన్‌కు భారీగా సమకూరిన ఆదాయం
7లో
మూగజీవాల మృత్యుఘోష
● పాడిగేదెలు, మేకల ప్రాణాలు తీసుస్తున్న కాలుష్య జలాలు

బడంపేటలో బాలుడికి డెంగ్యూ

కోహీర్, ఆగస్టు 21 : సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం బడంపేట గ్రామంలో డెంగ్యూ కేసు నమోదైంది. గ్రామానికి చెందిన 14 సంవత్సరాల బాలుడికి డెంగ్యూ సోకింది. వారం రోజుల క్రితం జ్వరంతో బాధపడుతున్న ఆ బాలుడిని కుటుంబసభ్యులు జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు ఆ బాలుడిని సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ కూడా బాలుడి ఆరోగ్యం కుదుటపడకపోవడంతో వారి సూచన మేరకు హైదరాబాదులోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఉస్మానియా ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం బాలుడికి డెంగ్యూ సోకినట్లు గుర్తించారు. బడంపేట గ్రామంలో డెంగ్యూ కేసు నమోదు కావడం పట్ల మండల పంచాయతీ అధికారి వినోద్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి కిష్టయ్య అప్రమత్తం అయ్యారు. గ్రామంలోని మురుగు కాలువలను శుభ్రపరిచి చెత్తాచెదారాన్ని తొలగించారు. అలాగే బిలాల్‌పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు నరేందర్, ఆరోగ్య సిబ్బంది గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలో ఇంటింటి జ్వర సర్వే నిర్వహించారు. అయితే, పది రోజుల క్రితం ఇదే గ్రామానికి చెందిన ఓ మహిళకూ డెంగ్యూ సోకినట్లు సమాచారం. ప్రస్తుతం ఆమె కోలుకుని ఆరోగ్యంగా ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు.



కోహీర్ మండలం బడంపేట గ్రామంలో బ్లీచింగ్ చల్లి, శానిటేషన్ చేస్తున్న పారిశుధ్య సిబ్బంది

కింది బజార్ మహబూబ్‌సాగర్ చెరువులో చేపలు మృతి

- 500 బెస్త కుటుంబాలకు అపార నష్టం
- చెరువును పరిశీలించిన జగ్గారెడ్డి
- ఇరిగేషన్, పొల్యూషన్, మున్సిపల్, మత్స్య శాఖ అధికారులతో సమీక్ష
- నష్ట నివారణ చర్యలకు ప్రతిపాదనలు
- బెస్త కుటుంబాలకు పరిహారం అందిస్తామన్న జగ్గారెడ్డి



సంగారెడ్డిలోని కింది బజార్ మహబూబ్‌సాగర్ చెరువు వద్ద అధికారులకు సూచనలిస్తున్న జగ్గారెడ్డి, చనిపోయిన చేపలు ఇన్‌సెట్‌లో

సంగారెడ్డి టౌన్, ఆగస్టు 21 : సంగారెడ్డి పట్టణంలోని కిందిబజార్ మహబూబ్‌సాగర్ చెరువులో లక్షలాది చేపలు మృత్యువాత పడ్డాయి. విషయం తెలుసుకున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి బుధవారం చెరువును సందర్శించి, చనిపోయిన చేపలను పరిశీలించారు. ఇరిగేషన్, పొల్యూషన్, మున్సిపల్, మత్స్య శాఖల అధికారులతో పాటు బెస్త కులస్థుల(గంగపుత్రులు)తో చెరువు వద్దకు వెళ్లి సమీక్షించారు. చెరువు కట్టపైనే సమీక్ష నిర్వహించిన జగ్గారెడ్డి నష్ట నివారణ చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. చెరువులో గుర్రపు డెక్కతో పాటు మురుగు నీటిని తొలగించి, పూడికతీత పనులకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలని జగ్గారెడ్డి సూచించారు. చేపలు మృతిచెందడటంతో 500 బెస్త కుటుంబాలకు అపార నష్టం జరిగిందని, వారికి పరిహారం అందించేందుకు కృషి చేయాలని మత్స్య శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సతీష్‌ను ఆదేశించారు.

నాలుగు శాఖల అధికారులతో జగ్గారెడ్డి సమీక్ష

చేపలు చనిపోవడానికి కారణమేమిటని పొల్యూషన్ అధికారిని, చెరువును శుద్ధి చేసేందుకు ప్రత్యామ్నాయమేమిటని నీటి పారుదల శాఖ డీఈఈ బాలగణేష్‌ను జగ్గారెడ్డి ప్రశ్నించారు. మత్స్య శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సతీష్, మునిసిపల్ కమిషనర్ సురేష్ పవార్, డీఈఈ ఇంతియాజ్ అహ్మద్‌తో చర్చించారు. దాదాపు 400 ఎకరాల్లో విస్తరించి ఉన్న చెరువులో 300 ఎకరాలకుపైగా పెరిగిన గుర్రపు డెక్క తొలగింపు, పూడికతీత పనుల నిర్వహణకు నిధుల మంజూరు కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జగ్గారెడ్డి సూచించారు.

సోమవారంలోగా ప్రతిపాదనలు సిద్ధం చేయండి

నష్ట నివారణ చర్యలకు సంబంధించిన ప్రతిపాదనలు సోమవారంలోగా సిద్ధం చేసి, ప్రభుత్వానికి అందజేయాలని జగ్గారెడ్డి సూచించారు. ఇరిగేషన్, మునిసిపల్ డీఈఈ, మత్స్య శాఖ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు సమన్వయంతో ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. ఈ పనుల మంజూరుకు తాను రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర్ రాజనర్సింహ, కొండా సురేఖతో పాటు కలెక్టర్, హెచ్ఎండీఏ అధికారులను కలుస్తానని జగ్గారెడ్డి తెలిపారు.

గ్యారంటీల అమలులో
అలసత్వం తగదు

- రెండు నెలలకోసారి సమీక్షించాలి
- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ
- ఆలయ భూములు ఆక్రమణకు గురవ్వకుండా చూడాలి
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ



కలెక్టరేట్ ఆవరణలో క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న మంత్రులు

సంగారెడ్డి టౌన్, ఆగస్టు 21 : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాల అమలులో అలసత్వం తగదని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖతో కలిసి బుధవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన క్యాంటీన్‌ను ప్రారంభించారు. ఇందిరా మహిళా శక్తి పథకానికి సంబంధించిన రుణాల చెక్కులను అందజేశారు. అనంతరం ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలు, విద్యా, వైద్యం, తాగునీరు, రుణమాఫీ, నూతన రుణాల పంపిణీ, చేనేత కార్మికుల సమస్యలు, గృహజ్యోతి పథకం, ఆర్టీసీ, విద్యా శాఖ, మున్సిపల్, ఎక్సైజ్, పంచాయతీ రాజ్, మిషన్ భగీరథ, దేవాదాయ శాఖ, వనమహోత్సవం, నిమ్జ్ భూసేకరణపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన నాలుగు నెలలకే పార్లమెంట్ ఎన్నికలు రావడంతో అభివృద్ధి సంక్షేమ పథకాల అమలులో కొంత జాప్యం ఏర్పడిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మైనింగ్, ఇరిగేషన్, ఎక్సైజ్, రెవెన్యూ, విద్యుత్ తదితర శాఖలకు సుపీరియల్ పవర్స్ ఇచ్చిందన్నారు. ఆయా శాఖలలో అక్రమాలకు తావు లేకుండా ప్రభుత్వానికి ఆదాయం వచ్చేలా ప్రజలకు మేలు జరిగేలా ప్రభుత్వం పనిచేస్తున్నట్లు తెలిపారు. అక్రమ మైనింగ్‌పై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుందన్నారు. ఆరు గ్యారంటీల అమలుకు ప్రతీ నెల లేదా రెండు నెలలకోసారి అధికారులు సమీక్షా సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది పని తీరుపై నిరంతరం నిఘా ఏర్పాటు చేయాలన్నారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ప్రభుత్వం పథకాలను ప్రజల వద్దకు చేర్చే విషయంలో నిర్లక్ష్యం తగదని హెచ్చరించారు. వనమహోత్సవంలో భాగంగా ఆలయాల భూముల్లో మొక్కలను నాటించాలన్నారు. దేవాదాయ శాఖకు చెందిన భూములు ఆక్రమణలకు గురి కాకుండా జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. దేవాదాయ భూములను సర్వే చేసి హద్దులను గుర్తించాలన్నారు.

ఈ కార్యక్రమంలో కలెక్టర్ క్రాంతి వల్లూరి, ఎంపీలు రఘునందన్‌రావు, సురేష్‌షెట్కార్, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మాణిక్‌రావు, సంజీవరెడ్డి, టీజీఐడీసీ ఛైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి, డీసీసీబీ అధ్యక్షుడు చిట్టి దేవేందర్‌రెడ్డి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీపీవో సాయిబాబా, జిల్లా వ్యవసాయ అధికారి నర్సింహారావు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఇందిరా మహిళా శక్తి రుణాల చెక్కును అందజేస్తున్న మంత్రులు

ఆఫ్‌లైన్ మాయాజాలం

సదాశివపేటలో పన్నుల సొమ్ము పక్కదారి?

- ఆన్‌లైన్‌లో కనిపించని ట్రేడ్ లైసెన్స్‌ల ఫీజుల జాబితా!
- కొరవడిన నిఘా.. బల్దియా ఆదాయానికి గండీ

అందిన కాడికి దోచేయ్..

సదాశివపేట, ఆగస్టు 21 : ఆన్‌లైన్ వద్దు.. ఆఫ్‌లైన్ ముద్దు అన్న తరహాలో సదాశివపేట మున్సిపల్ అధికారులు, సిబ్బంది వ్యవహరిస్తున్నారు. బల్దియాకు ట్రేడ్ లైసెన్స్‌ల ద్వారా రావాల్సిన ఫీజులను రాకుండా అడ్డుకుంటున్నారు. వసూలైన ట్రేడ్ లైసెన్స్ పన్నుల ప్రతీ రూపాయిని 'ఆన్‌లైన్'లో చూపించాలి. పూర్తి వివరాలను సంబంధిత వెబ్‌సైట్‌లో పొందుపరచాల్సి ఉంది. కానీ, సదాశివపేట బల్దియాలో అవేమీ ఆచరణలో లేవు. ఆస్తి పన్నులు, వసూళ్లు చేసిన ట్రేడ్ లైసెన్స్‌ల ఫీజుల వివరాలు 'ఆన్‌లైన్'లో ఎంత వెతికినా కనిపించవు.

మ్యానువల్ రశీదులు

పరిశ్రమలు, బడా సంస్థలు, ఫంక్షన్‌హాల్స్, సినిమా థియేటర్లు,



షాపింగ్‌మాల్స్, హాస్పిటల్స్, షోరూమ్‌లు మున్సిపాలిటీకి ట్రేడ్ లైసెన్స్‌ల ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది. అయితే, మున్సిపల్ అధికారులు ఈ వివరాలను సీడీఎంఏ-తెలంగాణ వెబ్‌సైట్‌లో నమోదు చేయకపోవడం అనేక అనుమానాలకు తావిస్తున్నది. బడా సంస్థలకు, పరిశ్రమలకు విధించాల్సిన ట్రేడ్ లైసెన్స్ ఫీజులకు భారీగా రాయితీలు ఇచ్చి నామమాత్రపు ఫీజులు వసూలు చేసినట్లు, వాటికి మ్యానువల్‌గా రశీదులు అందజేస్తున్నట్లు తెలుస్తున్నది. యజమాన్యాలతో సిబ్బంది కుమ్మక్కై ట్రేడ్ లైసెన్స్‌ల ఫీజుల సొమ్మును భారీ మొత్తంలో పక్కదారి పట్టిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఫీజుల రికార్డులను తనిఖీ చేయాలి

తెలంగాణ మున్సిపల్ చట్టం 2019-యాక్ట్11, జీవో ఆర్‌టీ నంబర్ -147 నిబంధనలను పక్కన బెట్టి బల్దియా సిబ్బంది మున్సిపల్ ఆదాయానికి గండి కొడుతున్నారు. పట్టణ పరిధిలోని చిన్న చిన్న వ్యాపార సంస్థలకు ట్రేడ్‌లైసెన్స్‌ల ఫీజులు ఎక్కువ మొత్తంగా విధిస్తున్న అధికారులు అదే సమయంలో కొన్ని పరిశ్రమలు, ఫంక్షన్‌హాల్స్, షాపింగ్‌మాల్స్‌కు తక్కువ మొత్తంలో ఫీజులు వసూళ్లు చేసి ట్రేడ్ లైసెన్స్‌లను జారీ చేస్తున్నట్లు సమాచారం. వివరాల నమోదుకు డిమాండ్ రిజిస్టరును సైతం సిబ్బంది నిర్వహించడం లేదని తెలుస్తున్నది. రికార్డులకు ఎక్కని ఈ వ్యవహారంతో బల్దియా ఆదాయానికి ప్రతీ ఏడాది రూ.కోట్ల మేరకు నష్టం వాటిల్లుతున్నది. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ ట్రేడ్ లైసెన్స్ ఫీజుల రికార్డులను తనిఖీ చేస్తే చోటు చేసుకున్న అక్రమాలు వెలుగు చూసే అవకాశం ఉన్నది. ట్రేడ్ లైసెన్స్ ఫీజులు వసూళ్ల రశీదులపై విచారణ చేయాల్సిన అవసరం ఉన్నది.




అన్నారం పంచాయతీలో జారీ చేసిన ఇంటి నంబర్ ప్లేట్

అంగట్లో ఇంటి నంబర్లు

అన్నారం పంచాయతీలో దర్జాగా దందా

గుమ్మడిదల, ఆగస్టు 21 : అన్నారం పంచాయతీలో ఇంటి నంబర్లు అంగడి సరుకుగా మారాయి. గతంలో అక్రమంగా కేటాయించిన ఇంటి నంబర్‌లు నేటికీ రద్దు కాకపోవడంతో అవి రియల్ వ్యాపారుల పాలిట వరంగా మారాయి. ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలకు, అనుమతి లేని కట్టడాలకు ఈ ఇంటి నంబర్‌లను దర్జాగా వాడుకునేందుకు పావులు కదుపుతున్నారు.

గతంలో అన్నారం స్థానిక వార్డు సభ్యుడు కుటుంబసభ్యులు, పంచాయతీ కార్యదర్శి కుటుంబసభ్యుల పేర్లతో సర్వే నంబర్ 261 కేసీఆర్ కాలనీలోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా ఇంటి నంబర్‌లను తీసుకున్నారు. అప్పట్లో విషయం బయటకు రావడతో కలెక్టర్ పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేశారు. సదరు ఇంటి నంబర్‌లను రద్దు చేస్తామని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి సస్పెండ్ అయి ఆరు నెలలు గడుస్తున్నా ఆ నంబర్‌లు మాత్రం రద్దు కాలేదు. అంతే కాకుండా ఈ ఇంటి నంబర్‌లకు శాశ్వత నంబర్ ప్లేట్‌లను రావడం విశేషం. ప్రస్తుతం ఈ ఇంటి నంబర్లను పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 261లో అక్రమంగా నిర్మించిన ఇంటికి ఇప్పించే పనిలో వున్నారు రియల్ వ్యాపారులు.



ప్రభుత్వ భూమిలో కేటాయించిన ఇంటి నంబర్ల జాబితా

ఇంటి నంబర్లు రద్దు చేసే అధికారం లేదు

అప్పట్లో జిల్లా పంచాయతీ అధికారులు ఇంటి నంబర్‌లను రద్దు చేయాల్సి ఉంది. కానీ అనివార్య కారణాలతో కాలేదు. ఆ ఇంటి నంబర్‌లను రద్దు చేసే అధికారం పంచాయతీ కార్యదర్శికి లేదు. ప్రస్తుతం పాత పేర్ల మీదే ఆ ఇంటి నంబర్లు కొనసాగుతున్నాయి. ఈ విషయం మరోసారి జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళతాం.

- సంగీత, పస్తుత పంచాయతీ కార్యదర్శి

ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి

- భారీ వర్షాలు కురిస్తున్నా తగ్గని వేడి
- భిన్న వాతావరణంతో సతమతం
- పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రతలు

మెదక్ అర్బన్, ఆగస్టు 21 : కొన్ని రోజులుగా ఉమ్మడి మెదక్ జిల్లా వాతావరణంలో అనూహ్య మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఓవైపు వర్షాలు.. మరోవైపు ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఎండ కాలంలో ఉక్కపోత ఎలా ఉందో ప్రస్తుతం అలాగే ఉండటం ఆశ్చర్యం కల్గిస్తోంది. వేడిమికి దినమంతా చెమటతో జనాలు చికాకు పడుతున్నారు. వానాకాలంలో వాతావరణం చల్లగా.. ఆహ్లాదకరంగా ఉండాలి... కానీ వరుసుగా భారీ వర్షాలు కురుస్తున్నా.. సాధారణ వర్షపాతం కంటే ఎక్కువే నమోదైనా.. వాతావరణం భిన్నంగా ఉండటం.. పగటి ఉష్ణోగ్రతలు పెరగడం విచిత్రంగా ఉంది. వర్షం కురిసిన ఆనందం ఒక్క రోజు కుడా ఉండటం లేదు. పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయి. మరో 24 గంటల పాటు ఉమ్మడి జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు ఐఎండీ వెల్లడించింది.

డి.ధర్మారంలో 36.1 డిగ్రీల ఉష్ణోగ్రత

గడిచిన 24 గంటల్లో అత్యధికంగా 36.1 డిగ్రీల పగటి ఉష్ణోగ్రత నమోదైంది. వేడిమి.. ఉక్కపోత తట్టుకోలేక పగలే ఏసీలు వినియోగిస్తున్నారు. ఈ క్రమంలో విద్యుత్ వినియోగం పెరిగినట్లు ట్రాన్స్‌కో అధికారులు చెబుతున్నారు. మెదక్ జిల్లా డి.ధర్మారంలో 36.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. మిగతా చోట్ల ఆటోమేటిక్ వెదర్ స్టేషన్లలో నమోదైన పగటి ఉష్ణోగ్రతలు ఇలా ఉన్నాయి. శివ్వంపేటలో 35.1 డిగ్రీలు, సంగారెడ్డి జిల్లా సదాశివపేటలో 35.4 డిగ్రీలు, జిన్నారం 35 డిగ్రీలు, సిద్దిపేట జిల్లా రేంబర్తిలో 35.3 డిగ్రీల వరకు పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఓ పక్క వేడి, మరో పక్క వర్షాల నేపథ్యంలో ఆరోగ్యంపై ప్రభావం చూపే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీసీహెచ్ఎస్ డాక్టర్ శివదయాల్ సూచించారు.



గాలిలో అధిక తేమ శాతం

కనిష్ఠ ఉష్ణోగ్రత 24, గరిష్ఠ ఉష్ణోగ్రత 31 డిగ్రీలలోపు ఉండాలి. గాలిలో తేమ శాతం అధికంగా ఉన్నప్పుడే ఉక్కపోతగా ఉంటుంది. వరుసగా వర్షాలు కురుస్తున్నా కొన్నిసార్లు చిరుజల్లులకే పరిమితం అవుతుండటంతో ఉక్కపోత మరింత ఎక్కువగా ఉంటోంది. రుతుపవన విరామ సమయంలో ఇలాంటి వాతావరణం ఉంటుందని ఐఎండీ అధికారులు చెబుతున్నారు. సగటు కంటే రెండు, మూడు డిగ్రీల ఉష్ణోగ్రతలు అధికంగా నమోదు కావడం ఇందుకు కారణమంటున్నారు. వానలతో తేమశాతం సహజంగానే పెరుగుతుందని, దాంతో శరీర ఉష్ణోగ్రత పెరిగి, చెమటలు వస్తాయని పేర్కొన్నారు.

పోలీస్‌స్టేషన్లకు కొత్త రూపు



జహీరాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్



పెయిటింగ్ వేయించడంతో కొత్త భవనంలా కనిపిస్తున్నసంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయం

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 21 : జిల్లా పోలీసు కార్యాలయంతో పాటు జిల్లాలోని పోలీస్‌స్టేషలన్నీ కొత్త రూపును సంతరించుకున్నాయి. జిల్లా ఎస్పీగా చెన్నూరి రూపేష్ బాధ్యతలు తీసుకున్న నాటి నుంచి ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు కృషి చేస్తున్నారు. పోలీస్‌స్టేషన్ భవనాలను మరమ్మతు చేయించి, పెయింటింగ్ వేయించారు. జిల్లా పోలీసు కార్యాలయాన్ని కూడా కార్పొరేట్ తరహా కార్యాలయంగా మార్చేశారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు మొక్కలను పెంచాలని పోలీసులకు సూచిస్తూ ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పిస్తున్నారు. పోలీస్‌స్టేషన్‌లకు వచ్చే వారికి కనీస అవసరాలు కల్పించారు. అలాగే పోలీస్‌స్టేషన్‌లలో పనిచేసే పోలీసులకు, సిబ్బందికి కనీస సదుపాయాలు కల్పించారు. దీంతో పోలీసుల్లో నూతనోత్సాహం చేకూరింది.



నారాయణఖేడ్ పోలీస్‌స్టేషన్ భవనం





సదాశివపేట పీఎస్‌లోని రిసెప్షన్ కౌంటర్, కొండాపూర్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో చెట్టు, మొక్కలతో పచ్చదనం

వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాల వేలం

మెదక్ అర్బన్, ఆగస్టు 21: జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో పలు కేసుల్లో పట్టుబడిన వాహనాలకు బుధవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయ ఆవరణలో వేలం పాట నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఇందుకు సంబంధించి ముందుగానే ప్రకటన చేయడంతో జిల్లా నలుమూలల నుంచి పలువురు వేలం పాటలో పాల్గొనేందుకు తరలివచ్చారు. ఎస్పీ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేలం పాటలో ముందుగా పోలీసులు పాటదారుల నుంచి డిపాజిట్ కట్టించుకొని టోకెన్లు అందజేశారు. 103 వాహనాలకు మొత్తం రూ.6,95,000 రాగా... వాటిని ప్రభుత్వ ఖాతాలో జమ చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, డీఎస్పీ, సీఐ, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

రైల్వే ట్రాక్ పైనుంచి పొలాలకు వెళ్లొద్దు



పనులను అడ్డుకుంటున్న రైతులు

కుకునూరుపల్లి, ఆగస్టు 21: రైల్వే ట్రాక్ పైనుంచి వ్యవసాయ పొలాలకు వెళ్లవద్దని రైల్వే అధికారులు అనడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైల్వేకు భూములు ఇచ్చిన తమకే ప్రవేశం లేదని అనడం సబబు కాదని మండిపడ్డారు. మనోహరాబాద్ నుంచి కొత్తపల్లి వరకు రైల్వేలైన్‌కు అనుమతులు వచ్చాయి. కుకునూరుపల్లి రైతు వేదిక ముందున్న లక్ష్మిచెరువు మీదుగా రైల్వే ట్రాక్‌ను నిర్మించారు. చెరువుకట్ట మీద నుంచి రైల్వేట్రాక్ దాటుకుని అవతలి వైపు దాదాపు 60 మంది రైతులకు సంబంధించిన 150 ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నాయి. అయితే రైల్వే ట్రాక్ పైనుంచి వ్యవసాయ పొలాలకు వెళ్లడానికి అనుమతి లేదని రైల్వే అధికారులు పలుమార్లు రైతులకు సూచించారు. బుధవారం రైల్వే అధికారులు వచ్చి ట్రాక్ ఇరువైపులా గొయ్యి తీసిపోయారు. అటువైపు వెళ్లే రైతులు చూసి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైల్వేలైన్‌కు భూములు ఇచ్చిన తమకే దారి ఇవ్వరా అని ప్రశ్నించారు. రైల్వే అధికారులు మాట్లాడుతూ ఎంపీని కానీ, దక్షిణ మధ్య రైల్వే అధికారిని కానీ కలిసి సమస్యను తెలియజేయాలని తెలిపారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

కళాశాల వద్ద బస్సులు ఆపాలని ఆందోళన



జిన్నారం కళాశాల వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు

జిన్నారం, ఆగస్టు 21: జిన్నారం ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఆర్టీసీ బస్సులు ఆపాలంటూ విద్యార్థులు ఆందోళన చేశారు. బుధవారం జూనియర్ కళాశాల ప్రధాన రహదారిపై విద్యార్థులు బైఠాయించి, బస్సులను అడ్డుకున్నారు. ఆర్టీసీ బస్సుల్లో విద్యార్థులకు ప్రయాణించే అవకాశం లేకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఈ విషయమై ఆయా డిపోల్లో పత్రాలు ఇచ్చినా స్పందించడం లేదంటూ విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కళాశాల వద్ద అన్ని బస్సులు ఆపేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి



లక్ష్మణ్(ఫైల్)

కంగ్టి, ఆగస్టు 21: రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని కారు ఢీకొనడంతో మృతిచెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని తుర్కవడగాం శివారులో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గాజుల్‌పాడ్ గ్రామానికి చెందిన మాల లక్ష్మణ్(62) తుర్కవడగాంలో ఉన్న కూతురు ఇంటి నుంచి స్వగ్రామమైన గాజుల్‌పాడ్‌కు నడుచుకుంటూ వెళ్తున్నాడు. గ్రామ శివారులోని దాబా వద్ద (టీఎస్ 15 ఈటీ 1688) నెంబరు గల కారును డ్రైవర్ వేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ నడుచుకుంటూ వెళ్తున్న లక్ష్మణ్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో లక్ష్మణ్ తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి కుమారుడు గౌతమ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నారాయణ తెలిపారు.

ఆర్టీసీకి రాఖీ పండుగ ఆదాయం రూ.5.12 కోట్లు

- మెదక్ రీజియన్‌కు భారీగా సమకూరిన ఆదాయం
- ఈ నెల 18 నుంచి 20వ తేదీవరకు ప్రత్యేక బస్సులు


సంగారెడ్డి కొత్త బస్టాండ్‌లో రాఖీ పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీ

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 21: సోదరులకు రాఖీలు కట్టేందుకు లక్షలాది మంది అక్కా, చెల్లెళ్లు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారు. మహాలక్ష్మి పథకం రాక ముందు ఆటోలు, జీపులు, ప్రైవేటు వాహనాలు.. ఏదీ అందుబాటులో ఉంటే ఆ వాహనంలో ప్రయాణించే వారు. మహిళలకు ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పించడంతో ఆర్టీసీ బస్సులనే ఆశ్రయించారు. రాఖీ పండుగను దృష్టిలో ఉంచుకొని ఆర్టీసీ ముందస్తు ప్రణాళికలు రూపొందించి ప్రత్యేక బస్సులు నడిపింది. మొత్తంగా రక్షాబంధన్ పర్వదినం ఆర్టీసీకి కలిసొచ్చిందని చెప్పవచ్చు.

రీజియన్‌కు రూ.5.12 కోట్ల ఆదాయం

రాఖీ పండుగను పరస్కరించుకొని ఆర్టీసీ 18 నుంచి 20వ తేదీవరకు నడిపిన ప్రత్యేక బస్సుల ద్వారా రికార్డుస్థాయిలో ఆదాయం సమకూరింది. మెదక్ రీజియన్‌కు రూ.5.12 కోట్ల ఆదాయం సమకూరింది. ఇందులో సిద్దిపేట డిపోకు రూ.కోటి 40 లక్షలు, జహీరాబాద్ రూ.83.45 లక్షలు, మెదక్ రూ.78.61 లక్షలు, సంగారెడ్డి రూ.72.87 లక్షలు, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ రూ.68.57 లక్షలు, నారాయణఖేడ్ రూ.49.67 లక్షలు, దుబ్బాక రూ.39.86 లక్షలు, నర్సాపూర్ రూ.14.45 లక్షల ఆదాయం వచ్చిందని ఆర్టీసీ అధికారులు తెలిపారు.

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ బస్ డిపోలో సంబరాలు

గజ్వేల్, ఆగస్టు 21: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ డిపో రాఖీ పండుగ సందర్భంగా రాష్ట్రస్థాయిలో ఆక్యూపెన్సీలో అగ్రస్థానంలో నిలవడంతో డిపో మేనేజర్ పవన్ ఆధ్వర్యంలో సంబరాలు చేస్తున్నారు. సిబ్బందికి, అధికారులకు మిఠాయిలను పంచిపెట్టారు. ఈ సందర్భంగా సిబ్బందికి, డిపో అధికారులకు డీఎం కృతజ్ఞతలు తెలిపారు. ఆయనవెంట డిపో అసిస్టెంట్ మేనేజర్ బాబునాయక్, ఎంఎఫ్ జమీల్, కంట్రోలర్స్, కండక్టర్లు, డ్రైవర్లు ఉన్నారు.


గజ్వేల్-ప్రజ్ఞాపూర్ బస్ డిపోలో సంబరాలు చేసుకుంటున్న మేనేజర్, సిబ్బంది


కాజీపల్లి పారిశ్రామికవాడ సమీపంలో కాలువలో చేరిన వ్యర్థ రసాయనాలు


కిష్టయ్యపల్లిలో కాలుష్య జలాలు తాగి మృతిచెందిన పాడిగేదె వద్ద బాధిత కుటుంబసభ్యులు

మూగజీవాల మృత్యుఘోష

పాడిగేదెలు, మేకల ప్రాణాలు తీస్తున్న కాలుష్య జలాలు

- 15 రోజుల వ్యవధిలో ఎనిమిది గేదెలు మృతి
- ఆర్థికంగా నష్టపోతున్న రైతులు
- చోద్యం చూస్తున్న పీసీబీ అధికారులు

జిన్నారం, ఆగస్టు 21: జిన్నారం మండల పారిశ్రామికవాడల్లో పరిశ్రమల రసాయన వ్యర్థ జలాలు మూగజీవాల పాలిట మృత్యు జలాలుగా మారాయి. నోరు లేని మూగజీవాలైన పాడి గేదెలు, మేకలు కలుషిత జలాలు తాగి మృత్యువాత పడుతున్నాయి. కేవలం 15 రోజుల వ్యవధిలో గడ్డపోతారం, కాజీపల్లి గ్రామాల్లో పాడి గేదెలు కాలుష్య జలాలు తాగి మరణించంగా.. వాటిపై ఆధారపడ్డ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పరిశ్రమల ధన దాహంతో బహిరంగ ప్రాంతాలకు వ్యర్థ రసాయనాలు వదిలేయగా చెరువులు, కుంటల్లో చేరిన కలుషిత నీటిని తాగి మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి.

సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలంలోని గడ్డపోతారం, కాజీపల్లి, బొల్లారం ప్రాంతాల్లో తరచూ కాలుష్య రసాయన వ్యర్థాలు తాగి మూగజీవాలు మరణిస్తున్నాయి. పరిశ్రమలు నిత్యం బహిరంగ ప్రాంతాల్లో రసాయన జలాలు వదిలేయగా.. మేత కోసం వెళ్లే జీవిలు దాహం తీర్చుకునేందుకు వాటిని తాగి మరణిస్తున్నాయి. మూడు దశాబ్దాలుగా ఆ ప్రాంతంలో ఈ సమస్య నెలకొన్నది. ఇటీవల కురుస్తున్న వర్షపు నీటిలో కొన్ని పరిశ్రమలు వ్యర్థాలను వదిలేయగా.. ఇటీవల కాజీపల్లికి చెందిన ఇద్దరు రైతులకు చెందిన మూడు పాడిగేదెలు మరణించాయి. ఈ నెల 20 గడ్డపోతారం పంచాయతీ కిష్టయ్యపల్లికి చెందిన యువ రైతు బసెట్టి సాయికుమార్‌కు చెందిన రెండు పాడిగేదెలు మరణించగా, 21న మూడు పాడిగేదెలు మృత్యువాత పడగా.. మరో నాలుగు ప్రాణాపాయ స్థితిలో ఉన్నాయి. కాగా పరిశ్రమల నిర్లక్ష్యంతో నీటి వనరులు కలుషితమై మూగజీవాలు తరచూ మరణిస్తున్నాయని ఆయా గ్రామాల రైతులు వాపోతున్నారు. పారిశ్రామికవాడల సమీపంలోని గ్రామాల జలాశయాలు పూర్తిగా కాలుష్య కోరల్లో చిక్కుకుని అందులోని నీరు సహ భూగర్భ జలాలు కలుషితమయ్యాయి. ఇక పాడి గేదెల పోషణతో జీవనం సాగిస్తున్న చాలామంది ఈ ప్రాంత రైతులకు వ్యర్థ జలాలతో నష్టం కలుగుతున్నది. కాలుష్య సమస్యను పరిష్కరించాల్సిన పీసీబీ అధికారులు పట్టించుకోకపోవడంతో సమస్య మరింత తీవ్రంగా మారుతోంది.

పాడిగేదెల మృతితో రూ.7 లక్షల నష్టం

పాడిగేదెల పోషణపై ఆధారపడి జీవిస్తున్న తమకు పరిశ్రమల నుంచి వ్యర్థ రసాయనాలతో తీవ్ర నష్టం కలుగుతుందని బాధిత రైతు బసెట్టిగారి సాయికుమార్ అన్నాడు. రెండురోజుల వ్యవధిలో తన ఐదు గేదెలు మృతిచెందగా.. మరో 4 ప్రాణాపాయ స్థితిలో ఉన్నాయని ఆవేదన చెందాడు. మృతిచెందిన ఐదు పాడిగేదెల విలువ రూ.7 లక్షల వరకు ఉంటుందని, తనకు న్యాయం చేయాలని, జలాశయాల్లోకి రసాయన వ్యర్థాల ప్రవాహాన్ని నియంత్రించాలని కోరాడు.

మల్లేశం స్వీయ చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించిన మంత్రి


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, ఆగస్టు 21: హుస్నాబాద్ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం తెలంగాణ సాయుధ పోరాట యోధుడు మేర మల్లేశం స్వయచరిత్ర, పోరాట పాటలపై డాక్టర్ కె.ముత్యం సంపాదకుడిగా, కవి అన్నవరం దేవేందర్ రాసిన పుస్తకాన్ని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ సాయుధ పోరాటంలో మేర మల్లేశం పాత్రను మంత్రి గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ హౌజ్ ఫెడ్ చైర్మన్ బొమ్మ శ్రీరాంచక్రవర్తి, కాంగ్రెస్ నాయకులు డాక్టర్ అక్కు శ్రీనివాస్, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పీసీబీ కార్యాలయం ఎదుట కిష్టయ్యపల్లివాసుల ధర్నా

జిన్నారం, ఆగస్టు 22: పరిశ్రమల కాలుష్య జలాలు తాగి, ఒకే రైతుకు చెందిన ఐదు గేదెలు మరణించడంతో ఆగ్రహం చెందిన కిష్టయ్యపల్లి వాసులు సనత్‌నగర్‌లోని పీసీబీ కేంద్ర కార్యాలయం ఎదుట మృతిచెందిన గేదెలతో ధర్నా నిర్వహించారు. గడ్డపోతారం పంచాయతీ కిష్టయ్యపల్లి గ్రామానికి చెందిన యువరైతు బాశెట్టి సాయికుమార్ పాడిగేదెలు మంగళవారం మేతకు వెళ్లి రసాయన వ్యర్థ జలాలు తాగి రెండు మృతిచెందగా.. బుధవారం మరో మూడు మృతిచెందాయి. మరో నాలుగు ప్రాణాపాయ స్థితిలో ఉన్నాయి. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన బాధిత రైతు కుటుంబం, స్థానిక నాయకులు మృతిచెందిన పాడిగేదెల మృతదేహాలతో తరలివెళ్లి పీసీబీ కేంద్ర కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పరిశ్రమలు బాధ్యతారాహిత్యంగా కాలుష్య జలాలను బహిరంగ ప్రాంతాలకు వదిలివేయడంతో జలాశయాలు కలుషితమవుతున్నాయని ఆందోళన చేశారు. మూగజీవాలు మేతకు వెళ్లి కలుషిత జలాలు పడుతున్నాయని, ఇందుకు బాధ్యులైన పరిశ్రమలను గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. రైతు సాయికుమార్‌కు గేదెల మృతితో రూ.7 లక్షల నష్ట వచ్చిందని, ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం పీసీబీ అధికారులు పిర్యాదు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు ప్రకాశంచారి, నీరుడి శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ బాశెట్టి రాజు, నాయకులు పెంటేష్, వేణు, కుమార్, మాజీ వార్డుసభ్యులు, మహిళలు పాల్గొన్నారు.


సనత్‌నగర్‌లోని పీసీబీ రాష్ట్ర కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కిష్టయ్యపల్లివాసులు

భారీ వర్షాలతో దెబ్బతిన్న ఇళ్లు

- సందర్శించిన అధికారులు


రుక్మాపూర్‌లో కూలిన ఇల్లు

చేగుంట, ఆగస్టు 21: మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి చేగుంట మండలంలోని పలు గ్రామాల్లో పురాతన ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. మండలంలోని 77.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా.. పలు గ్రామాల్లో కొంతమేరకు చెరువు, కుంటల్లో వర్షపునీరు చేరింది. భారీ వర్షానికి మండలంలోని రుక్మాపూర్‌లో మ్యాకల పెంటమ్మ, కట్ట రేణుక, శ్రీరాం నర్సింహులు, ఉల్లి తిమ్మాయిపల్లిలో కమ్మరి కమలమ్మ, పోలంపల్లిలో కొండి నాగమ్మతో పాటు పలు గ్రామాల్లో ఇళ్లు దెబ్బతినడంతో అధికారులు ఆయా గ్రామాలను సందర్శించారు. దెబ్బతిన్న ఇళ్లలో ఉండొద్దని, పునరావాసం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామంలో సమస్యలు తలెత్తితే వెంటనే పంచాయతీ కార్యదర్శులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. మక్కరాజిపేట్ రోడ్డులో గల హెచ్‌పీ పెట్రోల్ బంక్ చుట్టూ వర్షపునీరు చేరడంతో మోటార్ల సహాయంతో బయటకు పంపిస్తున్నారు.

రాజస్థాన్ ప్రభుత్వ అడ్వకేట్ ఆన్ రికార్డుగా ఉదయ్‌కుమార్‌సాగర్


ఉదయ్‌కుమార్‌సాగర్

నారాయణఖేడ్, ఆగస్టు 21: రాజస్థాన్ రాష్ట్ర ప్రభుత్వ అడ్వకేట్ ఆన్ రికార్డుగా సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌కు చెందిన శెట్టి ఉదయ్‌కుమార్‌సాగర్‌ను నియమిస్తూ రాజస్థాన్ ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి కుమార్‌జైన్ ఉత్తర్వులు జారీచేశారు. ఉదయ్ కుమార్ సాగర్ నారాయణఖేడ్ డివిజన్‌లోని నాగల్‌గిద్ద మండలం గూడురుకు చెందిన దివంగత న్యాయవాది మాధవరావుసాగర్ కుమారుడు. ఉదయ్‌కుమార్‌సాగర్ న్యాయవాద పట్టా పొందగానే సుప్రీంకోర్టు న్యాయవాదిగా పనిచేస్తున్నారు. ఇప్పటికే ఆయన హర్యానా ప్రభుత్వ అడ్వకేట్ జనరల్‌గా, సెంట్రల్ క్రికెట్ బోర్డు అడ్వకేట్ ఆన్‌రికార్డుగా, కేంద్ర ప్రభుత్వ సెంట్రల్ ఏజెన్సీ ప్యానెల్‌లోను పనిచేస్తున్నారు. బొట్స్వాన దేశంలో తెలంగాణ రాష్ట్ర ప్రతినిధిగా కూడా పనిచేస్తున్నారు. తాజాగా రాజస్థాన్ ప్రభుత్వం తరఫున సుప్రీంకోర్టులో వాదించడానికి అడ్వకేట్ ఆన్ రికార్డుగా కూడా ఆ ప్రభుత్వం నియమించింది. రాష్ట్రంలోనే మారుమూల ప్రాంతంలో జన్మించిన శెట్టి ఉదయ్‌కుమార్‌సాగర్‌ను రాజస్థాన్ ప్రభుత్వం అడ్వకేట్ ఆన్ రికార్డుగా నియమించడం పట్ల ఆ ప్రాంతవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కిడ్నాప్‌కు గురైన యువతిని కాపాడిన పోలీసులు


కిడ్నాప్ చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

మద్దూరు, ఆగస్టు 21: కిడ్నాప్‌కు గురైన యువతిని పోలీసులు కాపాడారు. ఈ సంఘటన సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం గాగిళ్లాపూర్ హామ్లేట్ గ్రామం జల్లిగూడెంలో బుధవారం చోటుచేసుకున్నది. ఎస్ఐ షేక్ మహబూబ్ వివరాల ప్రకారం.. ములుగు జిల్లా ఏటూరునాగరం మండలం గూగుల్లపల్లి గ్రామానికి చెందిన తీగల రాజేశేఖర్‌రెడ్డి(30), హన్మకొండ జిల్లా వెలేరు మండలం ఎర్రవెల్లి గ్రామానికి చెందిన నాలీబాల శిరీష(23) హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో ఆస్పిరో ఫార్మాసూటికల్స్ కంపెనీలో పనిచేస్తున్నారు. ఈ నెల 20న రాజశేఖర్‌రెడ్డి శిరీషకు మాయమాటలు చెప్పి కిడ్నాప్ చేసి సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం గాగిళ్లాపూర్ హామ్లేట్ గ్రామం జల్లిగూడెంలోని తన స్నేహితుడి ఇంటికి తీసుకొచ్చాడు. రాజశేఖర్‌రెడ్డి ప్రవర్తనలో మార్పును గమనించిన యువతి 100 నంబరుకు కాల్‌చేసి తాను కిడ్నాప్‌కు గురైనట్లు తెలిపింది. వెంటనే స్పందించిన మద్దూరు పోలీసులు ఎస్ఐ షేక్ మహబూబ్ ఆదేశాలతో ఏఎస్ఐ జగదీశ్వర్ సిబ్బందితో కలిసి జల్లిగూడెం చేరుకుని ఇరువురిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అప్పటికే కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో కిడ్నాప్ కేసు నమోదై ఉందని తెలిపారు. ఈ విషయమై కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించినట్లు పేర్కొన్నారు. 100 కాల్‌కు స్పందించి యువతిని కాపాడిన పోలీసులను సిద్దిపేట సీపీ డాక్టర్ బి.అనురాధ అభినందించారు.

దాశరథి నేటి యువతకు స్ఫూర్తి: సుద్దాల అశోక్‌తేజ


మాట్లాడుతున్న ప్రముఖ సినీ గేయ కవి సుద్దాల అశోక్‌తేజ

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 21: నవయుగ వైతాళికుడు దాశరథి నేటి యువతకు స్ఫూర్తి అని ప్రముఖ సినీ గేయ కవి సుద్దాల అశోక్‌తేజ కొనియాడారు. సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగుశాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సాహిత్య అకాడమీ మహాకవి 'దాశరథి జీవితం-సాహిత్యం సమాలోచనలు' అనే అంశంపై కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సుద్దాల అశోక్‌తేజ మాట్లాడుతూ నిజాం సర్కార్ ద్వారా శిక్షించబడి, అనంతరకాలంలో స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మహాకవి దాశరథిని ఆస్థాన కవిగా చేసి ప్రభుత్వం గౌరవించిందన్నారు. దాశరథి వ్యక్తిత్వం, జీవితం, సాహిత్యాల గురించి జమిలీగా ప్రసంగిస్తూ ఉద్యమ కవిగా, ప్రబోధ కవిగా, శృంగార కవిగా దాశరథిలోని పలు పార్శ్వాలను స్పృశిస్తూ సభకు హాజరైన విద్యార్థుల మానసిక వికాసాన్ని దృష్టిలో ఉంచుకొని అద్భుతంగా ప్రసంగించారు. అనంతరం తెలుగు సాహిత్య అకాడమీ కార్యదర్శి డా.నామోజు బాలాచారి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వివిధ విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో దాశరథి జీవితంపై కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రత్నప్రసాద్, డా.నాలేశ్వరం శంకరం, అధ్యాపకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై డీఎల్పీవో ఆగ్రహం


- కంది పంచాయతీ కార్యదర్శికి షోకాజ్ నోటీసులు
- వారంరోజుల్లో మార్పు కనపడకపోతే చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


కందిలోని డంపింగ్‌యార్డు వద్ద పంచాయతీ కార్యదర్శి విద్యాధర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డీఎల్పీవో అనిత

కంది, ఆగస్టు 21: ఆంధ్రజ్యోతిలో బుధవారం ప్రచురితమైన 'అటకెక్కిన తడి,పొడి చెత్త సేకరణ' అనే కథనానికి సంగారెడ్డి డీఎల్పీవో అనిత స్పందించారు. కందిలోని డంపింగ్‌యార్డును, అసైన్డ్ భూమిలో పారబోస్తున్న చెత్తను ఎంపీవో మహేందర్‌రెడ్డితో కలిసి బుధవారం పరిశీలించారు. డంపింగ్‌యార్డు వద్ద తడి, పొడి చెత్తలను వేరుచేయడం లేదని గుర్తించారు. డంపింగ్‌యార్డులో ఎరువు తయారుచేసిన దాఖలాలు లేవని ఆమె గమనించారు. తడి చెత్తతో ఎరువు తయారు చేయడంలో, ప్లాస్టిక్ కవర్లను నిషేధించడంతో పాటు పారిశుధ్య నిర్వహణ సరిగ్గా లేదని కంది పంచాయతీ కార్యదర్శి విద్యాధర్‌కు షోకాజ్ నోటీసులు జారీచేశారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ కంది గ్రామంలో తడి, పొడి చెత్త సేకరణ జరగడం లేదన్నారు. డంపింగ్‌యార్డు పరిసరాలు కూడా అస్తవ్యస్తంగా ఉన్నాయన్నారు. పారిశుధ్య నిర్వహణలో లోపం కొట్టొచ్చినట్లు కనపడుతుందన్నారు. తాను మరో వారంరోజుల్లో కందిని సందర్శిస్తానని, పారిశుధ్య నిర్వహణలో మార్పు కనపడకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి విద్యాధర్‌ను డీఎల్పీవో హెచ్చరించారు.

మేనమామను పెళ్లాడుతానన్న కుమార్తె.. మనస్తాపంతో తండ్రి ఆత్మహత్య


రాజు(ఫైల్)

హుస్నాబాద్‌రూరల్, ఆగస్టు 21: కూతురు తన సొంత మేనమామను వివాహం చేసుకుంటాననడంతో మనస్తాపం చెందిన తండ్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.. వివరాల్లోకి వెళ్తితే హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్) గ్రామానికి చెందిన కాటవేని రాజు (40)కు భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టులో గుడాటిపల్లి గ్రామం ముంపునకు గురికావడంతో ప్రభుత్వం అందించిన పరిహారం, ప్యాకేజీ డబ్బులతో పోతారం(ఎస్)లో భూమి కొనుగోలు చేసి నివాసం ఏర్పాటు చేసుకున్నాడు. తను మేస్త్రీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పెద్ద కూతురు వివాహమైంది. కాగా, చిన్న కూతురు తన సొంత మేనమామను వివాహం చేసుకుంటానని తండ్రితో చెప్పింది. ఇది నచ్చని రాజు మనస్తాపానికి గురై మంగళవారం రాత్రి సమీపంలో ఓ చెట్టుకు ఉరివేసుకుని బలవన్మారణానికి పాల్పడ్డాడు. రాజు భార్య స్వరూప ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. రాజు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుస్నాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పీఏసీఎస్ నిధుల దుర్వినియోగంపై విచారణ

టేక్మాల్, ఆగస్టు 21: టేక్మాల్ సొసైటీలో నిధులు దుర్వినియోగం అయ్యాయని జిల్లా డీసీవోకు డైరెక్టర్లు రైతులు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై బుధవారం మండల కేంద్రమైన టేక్మాల్ సొసైటీ కార్యాయలంలో స్పెషల్ అధికారి, ఆర్డీవో రమాదేవి విచారణ చేపట్టారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. అనంతరం చైర్మన్, డైరెక్టర్లతో సమావేశం నిర్వహించి నిధుల దుర్వినియోగంపై అరాతీశారు. ఫిర్యాదులో పేర్కొన్న అంశాలకు సంబంధించిన పత్రాలను అందజేయాలని సీఈవో వేణుగోపాల్‌కు తెలిపారు. నిధులు దుర్వినియోగం అయినట్లు రుజువైతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇందులో సొసైటీ చైర్మన్ యశ్వంత్‌రెడ్డి, వైస్ చైర్మన్ వెంకయ్య, డైరెక్టర్లు శ్రీశైలం, సత్యనారాయణ, నర్సింహారెడ్డి, పాపయ్య తదితరులు ఉన్నారు.

మూడేళ్ల బాలికపై 30 ఏళ్ల వ్యక్తి అత్యాచారం

- ఆడిస్తానంటూ తీసుకెళ్లి ఘాతుకం
- నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 21: మూడేళ్ల బాలికపై 30 ఏళ్ల వ్యక్తి అత్యాచారానికి పాల్పడిన ఘటన సిద్దిపేట జిల్లా కేంద్రంలో వెలుగు చూసింది. త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలో నిర్మాణంలో ఉన్న ఓ అపార్ట్‌మెంట్‌లో నేపాల్‌కు చెందిన వ్యక్తి వాచ్‌మన్‌గా పని చేస్తూ భార్య.. మనుమరాలు(కొడుకు కూమార్తె)తో కలిసి ఉంటున్నాడు. అదే అపార్ట్‌మెంట్‌లో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం గోరఖ్‌పూర్ జిల్లాకు చెందిన 30 ఏళ్ల వ్యక్తి పెయింటింగ్ పని కోసం వచ్చాడు. అతను వాచ్‌మన్ మూడేళ్ల మనుమరాలిని ఆడిస్తానని చెప్పి.. రూంలోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. చిన్నారి ఏడుస్తుండటంతో వాచ్‌మన్ వెళ్లి చూసి.. మనుమరాలిని ఎత్తుకుని వెంటనే పోలీసులకు సమచారం అందించారు. త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ వెంటనే అక్కడికి వెళ్లి, చిన్నారిని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని విచారణ ప్రారంభించారు. అయితే, అఘాయిత్యానికి పాల్పడిన నిందితుడు పొన్నాల సమీపంలోని బ్రిడ్జి వద్ద పారిపోవడానికి ప్రయత్నిస్తుండగా, అరెస్ట్ చేశారు. నిందితుడిపై ఫోక్సోతో పాటు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, జ్యూడీషియల్ రిమాండ్‌కు పంపించారు.

అనుమానాస్పదంగా యువకుడి మృతి



మృతి చెందిన హరీశ్ , హరీశ్(ఫైల్)

కంది, ఆగస్టు 21: స్నేహితులతో మద్యం సేవించిన యువకుడు అనుమానాస్పదంగా మృతిచెందాడు. ఈ సంఘటన కంది మండల పరిధిలోని చేర్యాలలో బుధవారం చోటు చేసుకున్నది. చేర్యాల గ్రామానికి చెందిన మాద హరీశ్(28) ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం రాత్రి ఆ గ్రామ శివారులోని వెంచర్‌లో నిర్మాణంలో ఉన్న ఓ ఇంటిలో స్నేహితులతో కలిసి మద్యం సేవించాడు. మద్యం సేవించిన తర్వాత స్నేహితులు ఇంటికి వెళ్లగా.. హరీశ్ అక్కడే పడుకున్నాడు. బుధవారం ఉదయం ఆ ఇంటి యజమానికి గోడలకు నీళ్లు కొట్టేందుకు వెళ్లి చూసేసరికి హరీశ్ నిర్జీవంగా కనిపించాడు. ఇంద్రకరణ్ పోలీసులకు, గ్రామస్థులకు సమాచారం ఇచ్చాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సంగారెడ్డి ప్రభుత్వ తరలించారు. హరీశ్ గుండెపోటుతో చనిపోయాడని ఇంద్రకరణ్ ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..


చిక్కుడు కిరణ్ మృతదేహం


వర్గల్, ఆగస్టు 21: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ యువకుడు బుధవారం తెల్లవారుజామున మృతిచెందాడు. గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి వివరాల ప్రకారం.. గజ్వేల్ పట్టణానికి చెందిన చిక్కుడు కిరణ్(30)తో పాటు నలుగురు యువకులు వర్గల్ మండలం గౌరారం రాజీవ్ రహదారిపై ఫ్లెక్సీలు కట్టేందుకు కూలీ పనికి వచ్చారు. 7హిల్స్ హోటల్ సమీపంలో అర్ధరాత్రి సమయంలో కిరణ్‌తో పాటు మరో యువకుడు ఫ్లెక్సీలు పట్టుకుని రాజీవ్ రహదారిపై నడుచుకుంటూ వెళ్తున్నారు. ఈ క్రమంలో ప్రజ్ఞాపూర్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం కిరణ్‌ను వెనక నుంచి ఢీకొనడంతో బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తండ్రి నర్సింహులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన బైక్..


మృతిచెందిన స్వామి

సిద్దిపేట క్రైం, ఆగస్టు 21: బైక్‌పై అతివేగంగా వెళ్తూ విద్యుత్ స్తంభానికి ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన సిద్దిపేట జిల్లా కేంద్రంలో బుధవారం జరిగింది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట రూరల్ మండలం చిన్నగుండవెల్లి గ్రామానికి చెందిన గుర్జకుంట స్వామి(30) సిద్దిపేట ప్రభుత్వాస్పత్రి నుంచి ముస్తాబాద్ చౌరస్తా వైపు బైక్‌పై వేగంగా వెళ్తున్నాడు. ఈ క్రమంలో సాయిబాబా గుడి వద్ద రోడ్డుకు ఎడమవైపున ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహానికి పంచనామా విధించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి కూతురు(4) ఉన్నది.

పెళ్లికి ఆర్థిక ఇబ్బందులు.. యువకుడి ఆత్మహత్య


రావెల్లి రాజు (ఫైల్)

మనోహరాబాద్, ఆగస్టు 21: ఇంట్లో పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. మరో పక్క ఆర్థిక ఇబ్బందులు.. ఈ పరిస్థితుల్లో ఏం చేయాలో తోచని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మనోహరాబాద్ మండలం కోనాయిపల్లి పీటీ గ్రామంలో మంగళవారం రాత్రి జరిగింది. ఎస్ఐ సుభాష్‌గౌడ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పోచయ్య, వీరమణిలకు ఇద్దరు కూమార్తెలు ఉండగా, పెళ్లి చేసి పంపించారు. ఓ కుమారుడు రావెల్లి రాజు (21) ఉన్నాడు. కూలి పనులు చేస్తూ కుటుంబానికి అండగా ఉంటున్నాడు. అతనికీ పెళ్లి చేయాలని సంబంధాలు చూస్తున్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రమే కావడంతో అప్పు కోసం ప్రయత్నించినా దొరకలేదు. ఈ క్రమంలో మంగళవారం తల్లిదండ్రులు కూలి పనులకు వెళ్లగా ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. తల్లిదండ్రులు వచ్చి చూసి.. వెంటనే తూప్రాన్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి సరే.. వినియోగం ఏదీ?

● మన ఊరు- మన బడి కింద కాన్షీరాంనగర్ ప్రాథమిక పాఠశాలకు రూ. 6లక్షల వ్యయం ● పనులు పూర్తయిన తర్వాత మూతబడిన వైనం



కాన్షీరాంనగర్ ప్రాథమిక పాఠశాలకు నిర్మించిన ప్రహరీ, ఆవరణలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

అల్లాదుర్గం, ఆగస్టు 21: పాఠశాలల అభివృద్ధి కోసం వెచ్చించిన ప్రజాధనం అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ ఆశయం నీరుగారిపోతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత ప్రభుత్వం 'మన ఊరు- మనబడి' కింద ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాల కల్పన కోసం, ఇతర అభివృద్ధి పనుల కోసం లక్షలాది రూపాయల నిధులు మంజూరుచేసిన విషయం తెలిసిందే. ఈ పథకం కింద పాఠశాలల ఎంపికలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించినట్టు తెలుస్తున్నది. విద్యార్థులు తక్కువగా ఉన్న పాఠశాలలను మన ఊరు- మనబడి పథకం కింద ఎంపిక చేసిన అధికారులు లక్షలాది రూపాయల నిధులు వెచ్చించి తీరా పనులు పూర్తయ్యాక విద్యార్థులు లేరనే సాకుతో పాఠశాలను మూసివేశారు. పాఠశాలకు మెరుగులు దిద్దింది మూసివేసేందుకేనా అని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు.

ఎంపికలో నిర్లక్ష్యం

అల్లాదుర్గంలోని కాన్షీరాంనగర్‌లో ప్రాథమిక పాఠశాలను మన ఊరు- మన బడి పథకం కింద సంబంధిత విద్యాశాఖ అధికారులు ఎంపిక చేశారు. కాగా పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువ ఉన్నప్పటికీ ఈ పాఠశాలను ఎంపిక చేయడంపై అప్పట్లో విమర్శలు వెల్లువెత్తాయి. సరైన సౌకర్యాలు లేకుండా సమస్యల వలయంలో ఉన్న పాఠశాలలను ఎంపిక చేయకుండా కేవలం 11మంది విద్యార్థులే ఉన్న ఇలాంటి పాఠశాలలను ఎంపిక చేయడం విడ్డూరంగా ఉందంటూ పలువురు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినప్పటికీ ఈ పాఠశాల విద్యార్థులకు మౌళికవసతులు కల్పించేందుకు ప్రభుత్వం సుమారు రూ.6 లక్షల నిధులు మంజూరు చేయగా, అధికారులు పాఠశాల చుట్టూ ప్రహరీ, పాఠశాలలో విద్యుత్ సౌకర్యం తదితర పనులను పూర్తి చేసి రంగులు కూడా వేసి చక్కగా తీర్చిదిద్దారు. కానీ ఈ పాఠశాలలో సౌకర్యాలు సమకూర్చిన తర్వాత విద్యార్థులు కనీసం ఒక్కరోజైన కూర్చుండకుండానే మూతపడింది. ఈ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు, ఇతర పాఠశాలలకు వెళ్లడంతో విద్యార్థులు లేరన్న సాకుతో ఈ పాఠశాలను మూసి వేశారు. దీంతో ఎంతో అందంగా తీర్చిదిద్దిన ఈ పాఠశాలలో పిచ్చి మొక్కలతో పాడుబడిన పాఠశాలలాగా తయారైందని స్థానికులు మండిపడుతున్నారు. లక్షల రూపాయల వెచ్చించి నిర్మించిన ఈ పాఠశాల తిరిగి ప్రారంభించేలా చూడాలని, లేకుంటే వృథాగా ఉన్న భవనాన్ని ప్రజలకు ఉపయోగపడేలా ఇతర ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మా పిల్లలను ప్రైవేట్ పాఠశాలకు పంపిస్తున్నా..



ఇంటి సమీపంలోనే ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మా ఇద్దరు పిల్లలు సాహర్షా, శివానిలను చేర్పించాను. కానీ తోటి విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలకు వెళ్లడం, విద్యార్థుల సంఖ్య తగ్గిపోయింది. దీంతో తమ పిల్లలను కూడ ఆ విద్యార్థులతో పాటుగా ప్రైవేట్ పాఠశాలకు పంపిస్తుండటంతో ఈ పాఠశాలలో ఉపాధ్యాయుడు ఉన్నప్పటికిని,విద్యార్థులు లేక ఈ పాఠశాల మూతపడింది.

- నక్క సూర్యకుమార్, విద్యార్థి తండ్రి, కాన్షీరాంనగర్



సమావేశంలో మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్

'గ్రౌండ్ బేస్డ్ లెర్నింగ్' విజయవంతం చేయాలి

● మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, ఆగస్టు 21: గ్రౌండ్ బేస్డ్ లెర్నింగ్ కార్యక్రమం విజయవంతం చేయాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌హాల్‌లో జిల్లాలోని ఎంపిక చేసిన 20మంది విషయ నిపుణులకు గణిత, భౌతిక, రసాయన, జీవశాస్త్రాలపై కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు తరగతి గదిలో నేర్చుకున్న అంశాలను అర్థవంతంగా నిజ జీవితంలో ఉపయోగించుకునే విధంగా తయారు చేయాలని, ఆ దిశగా కంటెంట్ రూపొందించాలని సూచించారు. 6 నుంచి 10వ తరగతులవారీగా పైన తెలిపిన సబ్జెక్టులవారీగా తయారు చేసి, జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలలో అమలు చేయాలని డీఈవో రాధాకిషన్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ సుదర్శనమూర్తి, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, వివిధ విషయ నిపుణులు పాల్గొన్నారు.

డెమో రైలు తిరిగి ప్రారంభించాలి



మెదక్ ఎంపీకి వినతి పత్రాన్ని అందజేస్తున్న తపస్ నాయకుల

చేగుంట, ఆగస్టు 21: కరోనా కంటే ముందు వరకు ఉదయం, మధ్యాహ్నం వేళల్లో నిజామాబాద్ నుంచి కాచిగూడ స్టేషన్ వరకు రాకపోకలు సాగించిన డెమో రైలు సౌకర్యాన్ని తిరిగి పునరుద్ధరించాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావుకు చేగుంటలో తపస్ ఉపాధ్యాయ సంఘం నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ డెమో రైలును గతంలోలాగే నడిపిస్తే ఉద్యోగులకు, వ్యాపారులకు, విద్యార్థులకు, రైతులకు, నిత్యం కూలీ పనులకు వెళ్లే కూలీలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఎంపీకి వివరించారు. ఇందుకు మెదక్ ఎంపీ రఘునందన్ రావు సానుకూలంగా స్పందించినట్లు తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్ పేర్కొన్నారు. వినతిపత్రం సమర్పించినవారిలో తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్, తపస్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటస్వామి ఉన్నారు.

రేగోడులో భారీ వర్షం

రేగోడు ఆగస్టు 21: మండలంలో బుధవారం సాయంత్రం ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయమై ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి 6 గంటల వరకు వర్షం ఏకధాటిగా కురిసింది. ఈ వర్షానికి చేతికొచ్చిన పెసర పంట పాడైపోతుందని రైతులు వాపోయారు.

ఖేడ్‌లో జ్వర సర్వే ప్రారంభం

నారాయణఖేడ్, ఆగస్టు 21: ఖేడ్ మున్సిపల్ పరిధిలో బుధవారం నుంచి జ్వర సర్వేను ప్రారంభించారు. మున్సిపల్, వైద్యసిబ్బంది 1వ వార్డుకు సంబంధించిన చాంద్‌ఖాన్‌పల్లిలో ఇంటింటికీ తిరిగి కుటుంబీకులను అడిగి వివరాలను నమోదు చేసుకున్నారు. మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ సర్వేను పర్యవేక్షించారు.

వ్యవసాయాధికారుల బాధ్యతల స్వీకరణ

పుల్‌కల్, ఆగస్టు 21: చౌటకూర్ మండల వ్యవసాయ శాఖ అధికారిణిగా ప్రవీణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఆమె జహీరాబాద్ మండల ఏవోగా పని చేసి చౌటకూర్ మండలానికి బదిలీపై వచ్చారు. పుల్కల్ మండలంలోని పెద్దారెడ్డిపేట ఏఈవో చిట్కుల ప్రశాంత్ కోహీర్ మండలానికి బదిలీ కాగా, ఆయన స్థానంలో భగేష్ నియమితులయ్యారు. గొంగ్లూరు ఏఈవో మనిషా హత్నూర మండలానికి బదిలీ అయ్యారు.

● హవేళిఘణపూర్: హవేళిఘణపూర్ ఏవోగా బాల్‌రెడ్డి బుధవారం రైతు వేదికలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన చిలప్‌చెడ్ మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేసిన ఏవో బదిలీపై పాపన్నపేట మండలానికి వెళ్లారు.

● మునిపల్లి: మునిపల్లి మండల వ్యవసాయాధికారిగా అనితారెడ్డి బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆమె సదాశివపేట నుంచి బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ ఏవోగా పని చేసిన శివకుమార్ పటాన్‌చెరుకు బదిలీపై వెళ్లారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థి రూ.50 వేలు వితరణ

జోగిపేట, ఆగస్టు 21: తాను చదివిన పాఠశాలకు ఉడతా భక్తిగా ఆర్థికసాయం అందించాడు ఓ పూర్వ విద్యార్థి. జోగిపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 1975-76బ్యాచ్ విద్యార్థి మృత్యుంజయం ఇటీవల పంచాయతీరాజ్‌శాఖలో చీఫ్ ఇంజనీర్‌గా పదవీ విరమణ పొందారు. పాఠశాలలో నీటి నిల్వ కోసం బుధవారం ఆయన రూ.50వేల నగదును ప్రిన్సిపాల్ నరేష్‌కు అందజేశారు. భవిష్యత్తులో తమ బ్యాచ్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. కాగా మృత్యుంజయంను ప్రధానోపాధ్యాయుడు నరేష్, పీఆర్టీయూ ప్రాయోజిత ఉపాధ్యాయ పత్రికాసంపాదకవర్గ సభ్యుడు ఏ. మాణయ్య ఆధ్వర్యంలో శాలువా, పూలమాలలతో సన్మానించారు.

నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరైన ఆరోగ్యమిత్రలు

మెదక్ కల్చరల్, ఆగస్టు 21: తమ సమస్యలు పరిష్కరించాలంటూ జిల్లా వ్యాప్తంగా ఉన్న దాదాపు 50 మంది ఆరోగ్య మిత్రలు సమ్మెబాట పట్టారు. ఆరోగ్య మిత్రులందరినీ డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్లుగా గుర్తించాలని, జీవో 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని కోరుతూ రోజువారీగా వివిధ రకాల నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా బుధవారం నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెను ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య మిత్రలు సురేష్, బ్రహ్మం పాల్గొన్నారు.

సంగారెడ్డిలో వీధి వ్యాపారులకు శిక్షణ



మాట్లాడుతున్న అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ అమృతశ్రీ

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 21: నేషనల్ అసోసియేషన్ ఆఫ్ స్ట్రీట్ వెండర్స్ ఆఫ్ ఇండియా(ఎన్ఏఎస్‌వీఐ) ఆధ్వర్యంలో ఫుడ్ సేఫ్టీ, మున్సిపల్‌శాఖ సౌజన్యంతో నెస్లేవారి సహకారంతో సంగారెడ్డిలోని మున్సిపల్ కార్యాలయంలో ఫుడ్‌సేఫ్టీపై వీధి ఆహార వ్యాపారులకు శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. వీధి వ్యాపారులు పాటించాల్సిన నిబంధనలు, పరిశుభ్రత తదితర అంశాలపై అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ అమృతశ్రీ అవగాహన కల్పించి పలు సూచనలు చేశారు. మరో మూడు రోజుల పాటు ఈ శిక్షణ కార్యక్రమాలు కొనసాగించనున్నట్లు ఆమె తెలిపారు.

కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌చౌహాన్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ శ్రీషికా, సీనియర్ అకౌంట్స్ మేనేజర్ కమల్, స్టేట్ కో ఆర్డినేటర్ ప్రసన్న, నెస్లే నుంచి వసీం, మెప్మా నుంచి భారతి, వీధి వ్యాపారులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలు, మత్తు పదార్థాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



తూప్రాన్ గురుకుల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్ఐ లక్ష్మి

తూప్రాన్, ఆగస్టు 21: సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉంటూ, డ్రగ్స్ మహమ్మారికి దూరంగా ఉండాలని తూప్రాన్ ఏఎస్ఐ లక్ష్మీ సూచించారు. బుధవారం తూప్రాన్ పట్టణ పరిధి అల్లాపూర్ టోల్‌ప్లాజా వద్ద గల గురుకుల పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది కృష్ణ పాల్గొన్నారు.

● రేగోడు: డ్రగ్స్, గంజాయిలాంటి మత్తు పదార్థాలను నిర్మూలించాలని బుధవారం రేగోడు గాంధీ చౌక్ వద్ద ఎస్ఐ పోచయ్య ప్రజలకు అవగాహన కల్పించారు. అపరిచితులు ఫోన్లు చేస్తే సమాచారం ఇవ్వద్దని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ మల్లయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

● రామాయంపేట: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ బాల్‌రెడ్డి సూచించారు. బుధవారం పోలీసుశాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని వివేకానంద స్కూల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలతో అనర్థాలు, ఆరోగ్య సమస్యలపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ మల్లికార్జున్ తదితరులు ఉన్నారు.

● పెద్దశంకరంపేట: పెద్దశంకరంపేటలోని ఉత్తులూరు అండర్ పాస్ బ్రిడ్జి వద్ద బుధవారం ప్రజలకు యాంటీడ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పేట ఎస్ఐ శంకర్ మాట్లాడుతూ గంజాయి మత్తు పదార్థాల వలన కలిగే అనర్థాల గురించి వివరించారు. నేరాలు శిక్షలు గురించి ప్రజలకువివరించారు.

● పాపన్నపేట: పాపన్నపేట ఉన్నత పాఠశాల విద్యార్థులకు మత్తు పదార్థాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. విద్యార్థులు మత్తు పదార్థాలపై అవగాహన కలిగి ఉండి వాటికి దూరంగా ఉండాలని కార్యక్రమంలో హెచ్ఎం మహేశ్వర్, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

రుణమాఫీపై సందేహాలుంటే నివృత్తి చేసుకోవాలి



హత్నూర: దౌల్తాబాద్ క్లస్టర్ వ్యవసాయ అధికారుల కోసం నిరీక్షిస్తున్న రైతులు

నిజాంపేట, ఆగస్టు 21: రుణమాఫీపై రైతులకు సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలని ఏవో సోమలింగారెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం మండల వ్యవసాయ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం గ్రీవెన్స్ సెల్‌ను సందర్శించి పలు సలహాలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సౌకర్యార్థం మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేశామన్నారు. రుణమాఫీ విషయంలో ఏమైనా సందేహాలు ఉంటే తమ ఆధార్ కార్డుతో వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు.

దౌల్తాబాద్ క్లస్టర్ వద్ద రైతుల నిరీక్షణ

హత్నూర, ఆగస్టు 22: రైతు రుణమాఫీ వివరాలు తెలుసుకునేందుకు మండల పరిధిలోని దౌల్తాబాద్ క్లస్టర్ రైతు వేదికకు బుధవారం ఉదయం 11గంటలకు ఆయా గ్రామాల రైతులు వచ్చి అధికారుల రాక కోసం నిరీక్షించారు. అర్హులైన రైతులకు రుణమాఫీ జరిగేలా చూడాలని జిల్లా అధికారులు ఏవోలకు సూచించినప్పటికీ ఇక్కడి అధికారులు మాత్రం అందుబాటులో లేకపోవడం పట్ల రైతులు ఇబ్బందులకు గురయ్యారు.అధికారులు స్పందించి గ్రామసభలు నిర్వహించి, తమ సమస్యలు పరిష్కరించాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

రుణమాఫీ చేయకపోతే ఉద్యమిస్తాం: బీజేపీ

చిన్న శంకరంపేట ఆగస్టు 21: రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు చేసి కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని బీజేపీ మండలశాఖ నాయకులు హెచ్చరించారు. మండలకేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రైతులకు రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు జరగకపోతే రైతుల పక్షాన పెద్దఎత్తున ఉద్యమిస్తామని బీజేపీ నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పోగుల రాజు, మండల ప్రధాన కార్యదర్శి దశరథ్, జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు మూర్తి శంకర్, మండల నాయకులు తదితరులు ఉన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థుల ధర్నా

నర్సాపూర్, ఆగస్టు 21: పెండింగ్ స్కాలర్‌షిప్పులు మంజూరు చేయాలని, గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడపాలంటూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం వద్ద విద్యార్థులు ధర్నా నిర్వహించి ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సంతోష్ మాట్లాడుతూ గత ఆరేళ్లుగా విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు రాక చదువు మధ్యలోనే ఆపేయాల్సి పరిస్థితి నెలకొందన్నారు. గ్రామాలకు బస్సులు నడవక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు జగన్, ప్రవీణ్, రమేష్, వర్ధన్, ప్రసాద్, హేమంత్ ఉన్నారు.

'అనంతారం'లో ఎలాంటి అవినీతి జరగలేదు



అనంతారంలో గత పాలకవర్గంపై ఆరోపణలను ఖండిస్తూ వివరాలు వెల్లడిస్తున్న మాజీ సర్పంచ్ చిమ్ముల దీప

గుమ్మడిదల, ఆగస్టు 21 : అనంతారం గ్రామపంచాయతీలో గత పంచాయతీ పాలకవర్గ సభ్యులు నిధులు దుర్వినియోగం చేశారని కాంగ్రెస్ పార్టీ నాయకులు చేసిన ఆరోపణలను బుధవారం బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఖండించారు. గ్రామాభివృద్ధి పనులు చేసి ఎంబీ రికార్డు చేసి అభివృద్ధి పనులకు పంచాయతీ నుంచి నిధులు ఇచ్చామన్నారు. సీజీఆర్ ట్రస్టుపై అసత్య ఆరోపణలు మానుకోవాలని గ్రామ మాజీ సర్పంచ్ చిమ్ముల దీపా నరేందర్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీ నాయకులు హెచ్చరించారు. ఈ మేరకు అనంతారం గ్రామంలోని హనుమాన్ ఆలయ ఆవరణలో ప్రజల సమక్షంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాము పంచాయతీ పదవీ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి చేసిన అభివృద్ధి పనులకు మాత్రమే అధికారులు ఎంబీ రికార్డు చేసిన పనులకు మాత్రమే పంచాయతీ నుంచి చెక్కు రూపంలో డబ్బులు చెల్లించినట్టు తెలిపారు. బోర్ల విషయంలో సీజీఆర్ ట్రస్టు ద్వారా వేసిన బోర్లకు ఎక్కడ కూడా పంచాయతీ నుంచి డబ్బులు చెల్లించలేదని అవినీతి జరిగిందని ఆరోపించడం తగదని హితవు చెప్పారు. రాజకీయ లబ్ధి కోసం కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ పార్టీ నాయకులపై, మాజీ పంచాయతీ పాలకవర్గ సభ్యులపై బురదజల్లే ప్రయత్నం చేస్తే సహించబోమన్నారు. ఇప్పటికైనా లేనిపోని ఆరోపణలు మానుకొని గ్రామాభివృద్ధి కోసం పనిచేయాలని హితవు పలికారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ స్వరూప లక్ష్మణ్, మాజీ కోఆప్షన్ సభ్యుడు గోపాల్ ముదిరాజ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఊట్ల యాదిరెడ్డి, మహన్నే మహేష్ యాదవ్, నరసింహులు, మాజీ వార్డు సభ్యులు పలువురు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలి



పీహెచ్‌సీలో తనిఖీ నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో

పాపన్నపేట, ఆగస్టు 21: వైద్య సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని జిల్లా వైద్యాధికారి శ్రీరాం హెచ్చరించారు. బుధవారం పాపన్నపేట ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా వైద్యాధికారులు సారిక, ప్రదీప్ విధులకు గైర్హాజరు కావడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిపై చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. పీహెచ్‌సీలో పలు రికార్డులు పరిశీలించారు. సీహెచ్‌వో చందర్, సిబ్బంది సంపత్, శ్రీనివాస్ రెడ్డి, ఏఎన్ఎం మంజుల, తదితరులున్నారు.

రాష్ట్రస్థాయి యోగాకు గంగారం విద్యార్థులు



యోగా పోటీలకు ఎంపికైన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

కొండాపూర్, ఆగస్టు 21: గంగారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 9మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు పండరీనాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17న సంగారెడ్డి అంబేడ్కర్ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి యోగా పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు వెల్లడించారు.

పలు మండలాల్లో ఉచిత వైద్యశిబిరాలు



గొల్లపల్లిలో వైద్య పరీక్షలు చేస్తున్న సంగారెడ్డి వెల్నెస్ డాక్టర్లు, సిబ్బంది

కొండాపూర్, ఆగస్టు 21: మండల పరిధిలోని గొల్లపల్లిలో బుధవారం సంగారెడ్డి వెల్నెస్ అసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత హెల్త్ క్యాంప్ నిర్వహించారు. శిబిరానికి సుమారు 200 మందికి పైగా హాజరయ్యారు. హెల్త్ క్యాంప్‌లో ప్రజలకు ఈసీజీ, షుగర్, బీపీ తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ హెల్త్‌క్యాంప్‌లో డాక్టర్లు మౌనిక, హరిత, సిబ్బంది, జీపీ సెక్రెటరీ ఫాతిమా, గ్రామస్థులు పాల్గొన్నారు.

● పెద్దశంకరంపేట, ఆగస్టు 21: ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో పెద్దశంకరంపేటలోని యునాని ఆసుపత్రి వద్ద బుధవారం వృద్ధులకు వైద్య శిబిరం నిర్వహించారు. వృద్ధాప్యంలో సాధారణంగా వచ్చే అనారోగ్య సమస్యలకు ఆయూష్ వైద్య విధానాల ద్వారా సులువైన చికిత్స అందజేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆయూష్ వైద్యురాలు డాక్టర్ రజిని, యునాని వైద్యురాలు కన్నీరున్నీసా, ఫార్మసిస్టు ప్రియాకుమారి, సుస్మిత, సిబ్బంది జాఫర్, సాయిలు, దశరథ్ పాల్గొన్నారు.

● హత్నూర, ఆగస్టు 22: మండల పరిధిలోని సిరిపురం ప్రభుత్వ ఆయుర్వేదిక్ ఆసుపత్రి ఆవరణలో బుధవారం ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు పంపిణీ చేసినట్లు డాక్టర్ మంజీరా తెలిపారు. ఆయుర్వేదిక్ మందుల వాడకంతో ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని ఆమె వివరించారు.

ఆలె నరేంద్ర సేవలు చిరస్మరణీయం

పెద్దశంకరంపేట, ఆగస్టు 21: బీజేపీ సీనియర్‌నాయకుడు, మాజీ కేంద్రమంత్రి దివంగత ఆలె నరేంద్ర సేవలు చిరస్మరణీయమని పెద్ద మండల బీజేపీ అధ్యక్షుడు కోణం విఠల్ పేర్కొన్నారు. బుధవారం పెద్దశంకరంపేటలోని బీజేపీ కార్యాలయంలో దివంగత ఆలె నరేంద్ర జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆలే నరేంద్ర కేంద్రమంత్రిగా ఉన్న సమయంలో ఈ ప్రాంతాన్ని అన్నివిధాల అభివృద్ధి చేశాడని గుర్తు చేశారు. కార్యక్రమంలోమండల బీజేపీ నాయకులు బండాల శ్రావణ్‌కుమార్, మంగలి కృష్ణ, సుభాష్, ఎర్ర శ్రీహరి, బుగుడాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాల పనులు త్వరగా పూర్తి చేయాలి



అల్లాదుర్గం మండల పరిషత్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా పరిషత్ సీఈవో ఎల్లయ్య

తూప్రాన్, ఆగస్టు 21: అమ్మ ఆదర్శ పాఠశాల పనులను త్వరగా పూర్తి చేయాలని జడ్పీ సీఈవో, మండల ప్రత్యేక అధికారి సీహెచ్ ఎల్లయ్య పేర్కొన్నారు. మండలంలో జరుగుతున్న పనులపై బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనుల విషయంలో నిర్లక్ష్యం వహించవద్దన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శేషాద్రి, ఎంపీవో సతీష్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

● అల్లాదుర్గం: ప్రభుత్వ పథకాల అమలులో అధికారుల పనితీరు బేష్‌గా ఉందని జడ్పీ సీఈవో ఎల్లయ్య స్పష్టం చేశారు. బుధవారం ఆయన అల్లాదుర్గంలోని మండల పరిషత్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యాలయంలో సిబ్బంది కొరత ఉన్నప్పటికీ, అధికారుల పనితీరులో మాత్రం లోటు లేదని, ప్రభుత్వ పథకాల అమలుతీరు, ప్రజలకు కల్పిస్తున్న అవగాహనపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఎంపీడీవో శంకర్ యాదవ్, జూనియర్ అసిస్టెంట్ సజ్జద్‌అలీ ఉన్నారు.

రెండు బైక్‌లు ఢీకొని ఒకరి మృతి.. మరొకరికి గాయాలు

చేగుంట, ఆగస్టు 21: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన నార్సింగి మండల కేంద్రంలో బుధవారం సాయంత్రం చోటు చేసుకున్నది. నార్సింగి ఎస్ఐ హైమద్ మోహియుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. చేగుంట మండలం వల్లభాపూర్ చెందిన నేనావత్ మంత్య(45) సొసైటీ కార్యాలయం సమీపంలోని సర్వీస్ రోడ్డుపై రెండు ద్విచక్ర వాహనాలు ఢీకన్నాయి. ఈ ఘటనలో మంత్య అక్కడికక్కడే మృతి చెందాడు. చేగుంటకు చెందిన మాసుల శంకర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

మున్సిపల్ కరెంటు చోరీ.. రూ. 8వేల జరిమానా

తూప్రాన్, ఆగస్టు 21: తూప్రాన్ మున్సిపల్ పరిధిలో మున్సిపాలిటీ విద్యుత్‌ను అక్రమంగా వినియోగించిన వ్యక్తికి జరిమానా విధించినట్లు మున్సిపల్ మేనేజర్ రఘువరన్ తెలిపారు. పట్టణ పరిధిలో మున్సిపల్ స్ట్రీట్ లైట్ల విద్యుత్‌ను నాటు కోళ్ల ఫారానికి వినియోగిస్తున్నట్లు మున్సిపల్ సిబ్బందికి సమాచారం అందింది. సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని తనిఖీ చేయగా ఫౌల్ట్రీ నిర్వహిస్తున్న దుర్గయ్య స్ట్రీట్ లైట్ల విద్యుత్‌ను వినియోగిస్తున్నట్లు గుర్తించారు. అక్రమంగా మున్సిపల్ విద్యుత్ వినియోగిస్తున్న దుర్గయ్యకు రూ. 8వేల జరిమానా విధించారు.

మున్సిపల్ చట్టం ప్రకారమే ప్రాపర్టీ టాక్సులు

తూప్రాన్, ఆగస్టు 21: మున్సిపల్ చట్టం 2019ప్రకారమే ప్రాపర్టీ టాక్సులు విధించినట్టు మున్సిపల్ కమిషనర్ ఖాజా మొహియుద్దీన్ తెలిపారు. మున్సిపల్ చట్టం ప్రకారం రూపొందించిన భువన్‌యాప్‌లో భవన కొలతలు పొందుపరుస్తున్నట్లు వివరించారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ విలేకరులతో మాట్లాడుతూ.. ప్రాపర్టీ టాక్స్ విధింపులో ఏమైన సందేహాలు ఉంటే సంప్రదించవచ్చన్నారు. కొలతల్లో వ్యత్యాసాలు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని, పరిశీలన చేసి సరిచేస్తామని కమిషనర్ వివరించారు.

మొక్కల రక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి



సిర్గాపూర్ మండలం సుల్తానాబాద్ నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న విజిలెన్స్ డీఎఫ్‌వో వెంకటేశ్వర్లు

కల్హేర్, ఆగస్టు 21: గ్రామాల్లోని పల్లె ప్రగతి నర్సరీల్లో మొక్కల రక్షణకు చర్యలు తీసుకుని వాటిని ఎప్పటికప్పుడు సంరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని రాష్ట్ర అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ కార్యాలయ విజిలెన్స్ డీఎఫ్‌వో వెంకటేశ్వర్లు సూచించారు. సిర్గాపూర్ మండల పరిధిలోని సుల్తానాబాద్‌లో గల పల్లె ప్రగతి నర్సరీని ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో నాటిన మొక్కలు ఎండిపోకుండా సంరక్షించాలని, ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిలో మొక్కల పెంపకం చేపట్టాలని అధికారులకు విజిలెన్స్ డీఎఫ్‌వో సూచించారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ ప్లాంటేషన్ ఏపీడీ రాజు, సిర్గాపూర్ ఎంపీడీవో మల్సూర్ నాయక్, ఎపీవో బస్వరాజ్, ఈసీ, టీఏ తదితరులు పాల్గొన్నారు.

పురాతన ఆలయాల అభివృద్ధికి సహకరిస్తా

గుమ్మడిదల, ఆగస్టు 21: నియోజకవర్గంలో పురాతన ఆలయాల పునర్నిర్మాణానికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. గుమ్మడిదలలో శతాబ్దాల చరిత్ర కలిగిన పురాతన కల్యాణ సీతారాముల ఆలయం పునర్నిర్మాణానికి గ్రామంలోని ఆలయ కమిటీ, గ్రామపెద్దలు, దాతల సహకారంతో రూ.కోట్ల వ్యయం కాగల పనులు ప్రారంభించారు. బుధవారం గుమ్మడిదలలో ఆలయ పునర్నిర్మాణ పనులకు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ రామాలయ పునర్ నిర్మాణానికి తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పడమటి లక్ష్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి దేవేందర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పుట్ట నర్సింగ్ రావు, ఎంపీపీ ప్రవీణ విజయభాస్కర్ రెడ్డి, జడ్పీటీసీ కుమార్‌గౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విప్లవాత్మక మార్పులకు నాంది పలికిన రాజీవ్

పటాన్‌చెరు, ఆగస్టు 20: దేశ టెలీకమ్యూనికేషన్, ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ, ఆటో మొబైల్ రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులకు నాంది పలికిన అభివృద్ధి ప్రదాత స్వర్గీయ రాజీవ్‌గాంధీ దేశానికి చేసిన సేవలు మరువలేనివని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి పేర్కొన్నారు. రాజీవ్ జయంతిని పురస్కరించుకుని బుధవారం స్థానిక బస్‌స్టాండ్ వద్ద కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కేక్‌కట్ చేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సంజీవరెడ్డి, మతిన్, అతిక్, యువరాజ్, గోపాల్‌రెడ్డి, అబ్దుల్లా, బాషా, సంతోష్, హమీద్, కుంచాలరవి, అక్షిత్ తదితరులు పాల్గొన్నారు.

పోచారం పంచాయతీ కార్యదర్శిపై విచారణ

పుల్‌కల్, ఆగస్టు 21: మండలంలోని పోచారం పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డిపై వచ్చిన ఫిర్యాదులపై ఎంపీడీవో ఆనందమేరీ, ఎంపీఈవో శ్రీకాంత్‌గౌడ్ విచారణ జరిపారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనవాస్‌రెడ్డి కొంత కాలంగా గ్రామంలో రాజకీయ పార్టీల కార్యకర్తల మధ్య చిచ్చు పెడుతూ వివాదాలకు కారణమవుతున్నారంటూ మూడు రోజుల క్రితం గ్రామస్థులు పిర్యాదు చేశారు. ఈ మేరకు వారు బుధవారం గ్రామానికి చేరుకుని విచారణ జరుపగా కార్యదర్శి వ్యవహారశైలిపై ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. కార్యదర్శి విధుల పట్ల అలసత్వం ప్రదర్శిస్తూ ప్రజలు మధ్య వివాదాలు సృష్టిస్తూ గొడవలకు కారణమవుతున్నారని, వెంటనే బదిలీ చేయాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్య బీమా చేయించుకోవాలి



కంగ్టిలో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

కంగ్టి, ఆగస్టు 21: ప్రతి ఒక్కరూ ఆరోగ్య బీమా చేయించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రమైన కంగ్టిలోని నిర్మల పాలి క్లినిక్‌లో సహారా హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. మారుమూల ప్రాంతాల్లో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించడం పట్ల సహారా హాస్పిటల్ ఎండీ శంకర్ స్వామిని అభినందించారు. కార్యక్రమంలో సహారా హాస్పిటల్ ఎండీ మఠం శంకర్, నిర్మల ఆస్పత్రి వైద్యులు పాటిల్ శంకర్, సొసైటీ మాజీ చైర్మన్ మనోజ్‌పాటిల్, బసిరెడ్డి, నాగన్న, శ్రీనివాస్‌రెడ్డి, పట్నె నాగ్‌నాథ్, గుండయ్య స్వామి, గురుకుల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రాయ్ పాల్గొన్నారు.

సీఎం సహాయనిధితో నిరుపేదలకు ప్రయోజనం

జహీరాబాద్, ఆగస్టు 21: సీఎం సహాయనిధితో నిరుపేదలకు ఎంతగానో ప్రయోజనం చేకూరుతుందని రాష్ట్ర సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సిద్దం ఉజ్వల్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ఆదర్శనగర్ సెకండ్ వెంచర్‌లో ఆయన క్యాంపు కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు రూ.90 వేలు విలువ చేసే సీఎం సహాయనిధి చెక్కులను అందులో అందజేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, శుక్లవర్ధన్ రెడ్డి, అశ్విన్ పాటిల్, నర్సింహా యాదవ్, నాగిరెడ్డి, రాజ్‌కుమార్, నసీర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం: సమతా సైనిక్‌దళ్

జహీరాబాద్, ఆగస్టు 21: ఎస్సీవర్గీకరణ ఆర్టికల్ 341 ప్రకారం రాజ్యాం విరుద్ధమని సమతాసైనిక్‌దళ్ రాష్ట్ర నాయకుడు బాలరాజు పేర్కొన్నారు. భారత్‌బంద్‌లో భాగంగా సమతాసైనిక్ దళ్, దళితసంఘాల, కేవీపీఎస్ నాయకుల ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో రహదారిపై ఆందోళన చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని అన్ని ఎస్సీ, ఎస్టీ సంఘాలు, రాజకీయ పార్టీలు ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తున్నాయన్నారు. ఎస్సీవర్గీకరణను ఉపసంహరించుకోవాలని ఆయన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు డిమాండ్ చేశారు. మాలమహానాడు, సమతాసైనిక్ నాయకులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

● జోగిపేట: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ మాల మహనాడు ఆధ్వర్యంలో జోగిపేట బుధవారం బంద్ చేపట్టి ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ఎస్సీలను, వాటి ఉప కులాలను విభజించే ఆలోచన మానుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాలసంఘం నాయకులు పోచయ్య హనుమంతు మొగులయ్య జంగం మహేష్‌రాజు, ప్రసాద్, పెండ గోపాల్ పాల్గొన్నారు.